నేడు ఉచిత మెగా హెల్త్ క్యాంపు

అత్తాపూర్: ఎంఅండ్ఎం ఆర్థో ఆసుపత్రి అత్తాపూర్ ఆధ్వర్యంలో మోక్షజ్ఞ, మహోనాథ్‌ల జన్మ దినోత్సవం సందర్భంగా ఈ నెల 4న (నేడు) ఉచిత మెగా హెల్త్ క్యాంపును నిర్వహించనున్నట్లు మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మధు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్ సీతాఫల్‌మండి బ్రాంచ్‌లో ఆదివారం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆర్థోపెడిక్‌కు సంబంధించిన అన్ని సమస్యలను ప్రముఖ వైద్య బృందంతో పరీక్షలు చేస్తామని పేర్కొన్నారు. కార్పొరేట్‌కు దీటుగా సామాన్యులకు అందుబాటు ధరలు తమ ఆసుపత్రిలో ఉన్నాయని తెలిపారు. డాక్టర్లు స్రవంతి, మౌనిక దీప్, సౌజన్య, ప్రఖ్యాతిగాంచిన డాక్టర్ల బృందంతో చికిత్స అందించనున్నట్లు, మరిన్ని వివరాలకు 77991 28128, 93929 64884 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నేటి నుంచి బోనాల జాతర

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ, మంచిరేవుల గ్రామంలో ఈ నెల 4 నుంచి బోనాల జాతర నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మేకల శ్రీనివాస్ యాదవ్, ప్రధాన కార్యదర్శి డి.భాస్కర్ కురుమ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం మల్లన్న బోనాలు, సోమవారం బీరప్ప , మంగళవారం ఎల్లమ్మకు బోనాలు సమర్పిస్తామని భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. అలాగే ఉత్సవాలకు మంత్రులు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నట్లు వారు పేర్కొన్నారు.

అద్వానీకి భారత రత్న ప్రకటించడం హర్షణీయం

రాజేంద్రనగర్: మాజీ ఉప ప్రధాని లాల్ కృష్ణ అద్వానీకి కేంద్ర ప్రభుత్వం భారత రత్న అవార్డును ప్రకటించడంపై బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి వేముల మల్లేశ్, ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ ముదిరాజ్, సీనియర్ నాయకుడు బొక్క బాల్‌రెడ్డి, జిల్లా ఓబీసీ మోర్చా నాయకుడు మూల శ్రీనివాస్ గౌడ్ తదితరులు వేర్వేరు ప్రకటనల్లో అద్వానీకి శుభాకాంక్షలు తెలిపారు. దేశంలో పార్టీని బలమైన శక్తిగా ఎదిగేందుకు పునాదులు వేసిన గొప్ప నాయకుడు అద్వానీ అని కొనియాడారు. దేశంలోని హిందువులందరిని ఏకతాటిపై తీసుకొచ్చిన గొప్ప నాయకుడు అని గుర్తు చేశారు.

విద్యార్థులకు పోషకాహారం అందించాలి



ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న నవ యువయూత్ క్లబ్ సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి: విద్యార్థులకు సక్రమంగా పోషకాహారం అందించాలని బాబుల్‌రెడ్డి నగర్ నవయువ యూత్ క్లబ్ అధ్యక్షుడు ఏర్వ కుమార్ కోరారు. బాబుల్‌రెడ్డి నగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని శనివారం పరిశీలించి విద్యార్థులతో కలిసి తిన్నారు. అనంతరం పాఠశాల ఇన్‌చార్జి మాట్లాడుతూ..పేద విద్యార్థుల కోసం అక్షయపాత్ర ద్వారా ప్రతిరోజు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం పోషకాహారంతో కూడిన భోజనం పెడుతున్నామన్నారు. కార్యక్రమంలో యూత్ క్లబ్ ఉపాధ్యక్షుడు రమేశ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

షబ్బీర్ అలీకి సన్మానం



అబిడ్స్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే జరుగుతుందని టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీస్ ప్రభుత్వ సలహాదారుడిగా నియమితులైన షబ్బీర్ అలీని టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ముజీబ్ హుస్సేని మాట్లాడుతూ.. మైనార్టీల అభివృద్ధికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని షబ్బీర్ అలీని కోరారు. కార్యక్రమంలో నిజాముద్దీన్, ఉస్మానీ అలీ ఉస్మానీ, మొహ్మద్ జమాల్, రామకృష్ణారెడ్డి రోహిత్ తదితరులున్నారు.

త్వరలో 'ఎగ్జిబిషన్' స్పోర్ట్స్ మీట్



అబిడ్స్: నాంపల్లి ఎగ్జిబిషన్ సొసైటీ సభ్యుల కోసం త్వరలో స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నట్టు స్పోర్ట్స్ మీట్ సబ్ కమిటీ సలహాదారుడు మంజిత్‌రెడ్డి, కన్వీనర్ రాజశేఖర్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఎగ్జిబిషన్ సొసైటీ గాంధీ సెంటినరీ హాల్‌లో స్పోర్ట్స్ మీట్ ఏర్పాట్లను పరిశీలించి పోటీలకు డ్రా తీశారు. చెస్, క్యారమ్స్, టేబుల్ టెన్నిస్, క్రికెట్ తదితర పోటీలను నిర్వహిస్తున్నామని ఈ సందర్భంగా మంజిత్‌రెడ్డి తెలిపారు. విజేతలకు ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో బహుమతులు అందిజేస్తామన్నారు.

నేడు వికలాంగుల కోసం శిబిరం

సుల్తాన్‌బజార్: ప్రతిష్టాత్మక జాతీయ అవార్డు గెలుచుకున్న ఎన్‌జీఓ నారాయణ్ సేవా సంస్థాన్ నేడు తెలంగాణలో వికలాంగుల సంక్షేమం కోసం ఉచిత భారీ శిబిరం నిర్వహించనుందని భగవాన్ ప్రసాద్ గౌర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్యక్రమ బ్రోచర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రమాదంలో చేతులు, కాళ్లు కోల్పోయినవారిని రక్షించేందుకు తమ సంస్థ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో భాగంగా ఉచిత వైకల్య స్క్రీనింగ్ ఎంపిక, నారాయణ లింబ్, కాలిపర్స్ మెజర్‌మెంట్ క్యాంప్ నిర్వహిస్తామన్నారు. కింగ్‌కోఠిలోని ఈడెన్ గార్డెన్ ఫంక్షన్ ప్యాలెస్(హాల్), నెదర్ సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు, కార్యక్రమం ఉంటుందన్నారు. తమ వెంట ఆధార్‌కార్డు, వైకల్య ధృవీకరణ పత్రం, వైకల్యాన్ని తెలిపే 2 ఫొటోలు తీసుకురావాలని సూచించారు. సమావేశంలో ఇనిస్టిట్యూట్ ప్రెసిడెంట్ ప్రశాంత్ అగర్వాల్, క్యాంపు ఇన్‌చార్జి నరేంద్ర సింగ్ చౌహాన్, హైదరాబాద్ బ్రాంచ్ కో–ఆర్డినేటర్ అల్కా చౌదరి, హైదరాబాద్ శాఖ కార్యవర్గ మాజీ అధ్యక్షుడు ఉత్తమ్ దమ్రాణి అభయ్ చౌదరి, సామాజిక కార్యకర్త జస్మత్ భాయ్ పటేల్, రితేశ్ జాగిర్దార్ పాల్గొన్నారు.

ఎదురుచూపులకు తెర..!

- ఈ నెల 16న బండ్లగూడలో బలనిరూపణ సమావేశం
- ఆదేశాలు జారీ చేసిన కలెక్టర్
- కార్పొరేటర్లకు నోటీసులు అందించిన అధికారులు



బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

బండ్లగూడ: బండ్లగూడ అవిశ్వాస తీర్మానానికి త్వరలోనే తెరపడనున్నది. 16 మంది కార్పొరేటర్లు మేయర్ మహేందర్‌గౌడ్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడుతూ గత జనవరి 12న కలెక్టర్‌కు లేఖ ఇచ్చిన విషయం తెలిసిందే. అప్పటినుంచి బల నిరూపణ సమావేశం కోసం కార్పొరేటర్లు ఎదురు చూస్తున్నారు. ఎట్టకేలకు కలెక్టర్ స్పందించి ఈ నెల 16వ తేదీన మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని స్థానిక అధికారులను ఆదేశించారు. ఆ రోజు సమావేశానికి హాజరు కావాలని కోరుతూ కార్పొరేటర్లకు సైతం శనివారం నోటీసులు అందజేశారు. దాంతో అవిశ్వాసం అనివార్యమయ్యే పరిస్థితి నెలకొన్నది. కలెక్టర్‌కు అవిశ్వాసంపై నోటీసు అందించిన కార్పొరేటర్లు అప్పుడే గోవా క్యాంప్‌నకు తరలివెళ్లారు. ఇప్పటివరకు వారు స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌తో పాటు ఎవరికీ అందుబాటులోకి లేరు. దీంతో ఆయన చేసేదేమి లేక విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఏడాదిలో ఎన్నికలు ఉండగా అవిశ్వాసం ఎందుకని ప్రశ్నించారు. మేయర్ మహేందర్‌గౌడ్ సైతం తన పదవిని కాపాడుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగా ఓ మండలానికి చెందిన జడ్పీటీసీని గోవాకు రాయభారం కోసం పంపించినా ఫలితం లేకుండా పోయింది. ఎట్టకేలకు ఈనెల 16న అవిశ్వాస సమావేశం ఏర్పాటు చేయనుండడంతో కార్పొరేషన్ తెరచాటు రాజకీయాలకు తెరపడే అవకాశం కనిపిస్తున్నది. ఇకనైనా ప్రజాప్రతినిధులు వచ్చి తమ సమస్యలు పట్టించుకుంటారని ప్రజలు కూడా ఎదురుచూస్తున్నారు.



కార్పొరేటరు ఇంటి వద్ద నోటీసు అందిస్తున్న దృశ్యం

ఉదయ్ శంకర్ సేవలు మరువలేనివి

మణికొండ: మణికొండ ప్రభుత్వ పాఠశాల సోషల్ స్టడీస్ ఉపాధ్యాయుడు పటేల్ ఉదయ శంకర్ సేవలు మరువలేనివని పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పి.శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బి.కమలాకర్‌రావు అన్నారు. ఉదయ్‌శంకర్ ఇటీవల అనారోగ్యంతో అకస్మాత్తుగా మృతి చెందాడు. దీంతో ప్రధానోపాధ్యాయుడు నిరంజన్ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో సంస్మరణ సభను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తమ యూనియన్ తరపున బాధిత కుటుంబ సభ్యులకు రూ.లక్ష చెక్కును అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి జి.చెన్నకేశవరెడ్డి, జిల్లా అధ్యక్షుడు కె.గోవర్ధన్ యాదవ్, ప్రధాన కార్యదర్శి మహేందర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు మల్లేశ్, ప్రధాన కార్యదర్శి నర్సింహులతో పాటు పలు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉదయ్‌శంకర్ కుటుంబ సభ్యులకు చెక్కును అందిస్తున్న యూనియన్ నాయకులు

దొంగకు రిమాండ్

మణికొండ: ఇంటి ముందు ఉన్న వ్యక్తిని బెదిరించి సెల్‌ఫోన్, రూ.20 వేలను ఎత్తుకెళ్లిన వ్యక్తిని నార్సింగి పోలీసులు అరెస్టు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. స్నేహితహిల్స్‌లో ఉంటున్న సాహిల్ ధల్ వద్దకు హిమాయత్‌సాగర్‌కు చెందిన గునుగుర్తి ముకేశ్ ఈనెల 1న రాత్రి వచ్చాడు. చుట్టుపక్కలా ఎవరూ లేరని నిర్ధారించుకొని అతన్ని బెదిరించి సెల్‌ఫోన్, రూ.20 వేలను లాక్కొని పరారయ్యాడు. దీంతో బాధితుడు శుక్రవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని శనివారం అరెస్టు చేసి సెల్‌ఫోన్, రూ.18 వేలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్టు వారు తెలిపారు.

వాహనం ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

మణికొండ: రోడ్డు దాటుతున్న గుర్తు తెలియని వ్యక్తిని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని కాళీమందిర్ వద్ద శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాళీమందిర్ –సన్‌సిటీ మార్గంలో ఉన్న మధుర బార్ వద్ద ఓ వ్యక్తి రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో అతని తలకు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడి వయస్సు 35 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుందని, చికిత్స కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించామని పేర్కొన్నారు. తెలిసిన వారు ఉంటే నార్సింగి స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు సూచించారు.

అక్రమ వెంచర్, సెల్లార్లపై చర్యలు తీసుకోవాలి



మున్సిపల్ కమిషనర్ భోగీశ్వర్లుకు వినతి పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

శంషాబాద్: అక్రమ వెంచర్, సెల్లార్లపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు పీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పి. సంజయ్‌యాదవ్ శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ భోగీశ్వర్లుకు శనివారం వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పట్టణంలోని వెళంగనీ కాలనీ సమీపంలో ఇటీవల కొందరు జీవో 111 నిబంధనలకు విరుద్ధంగా అక్రమ వెంచర్లు, సెల్లార్లు తవ్వుతున్నా.. మున్సిపల్ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. వెంటనే చర్యలు తీసుకోవాలని లేకుంటే కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

కళ్ల ముందే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు

అత్తాపూర్: కాంగ్రెస్ చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కండ్లముందే కనిపిస్తున్నాయని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి అన్నారు. రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని ఆయన అనుచరులతో కలిసి శనివారం కలిశారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. అలాగే మాజీ సర్పంచ్ కొండకళ్ల కాంతారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధిని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్థానికంగా నిరుపేదలకు ఏర్పాటు చేసిన గృహాల్లో ప్రజలు దుర్భర జీవితం గడుపుతున్నారని.. వారికి అక్కడే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు.



మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని కలిసిన రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి ఎం గోవర్ధన్ రెడ్డి

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ట్రాఫిక్ నిబంధనలు వివరిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి

శంషాబాద్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని శంషాబాద్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని తొండుపల్లిలో స్థానికులకు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. మద్యం తాగి, హెల్మెట్, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపమని వారితో ప్రతిజ్ఞ చేయించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు గణనీయంగా తగ్గుతాయని శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ బోగీశ్వర్లు సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ రాజు తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ అయినా.. సిటీ కాలేజీ పూర్వ విద్యార్థినే



మాట్లాడుతున్న త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి

చార్మినార్: దేశంలో.. ఎక్కడ.. ఏ హోదాలో ఉన్నా.. సిటీ కాలేజీ పూర్వ విద్యార్థినని చెప్పుకోవడంలో అమితానందం కలుగుతుందని త్రిపుర గవర్నర్ ఎస్.ఇంద్ర సేనా రెడ్డి అన్నారు. తాను ప్రస్తుతం ఒక రాష్ట్రానికి గవర్నర్‌గా ఉన్నప్పటికీ.. సిటీ కాలేజీ విద్యార్థిననే విషయాన్ని గర్వంగా చెబుతానన్నారు. సిటీ కాలేజీ పూర్వ విద్యార్థులైన ఎస్.ఇంద్రసేనారెడ్డితో పాటు మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్, చార్మినార్ ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన మీర్ జుల్ఫీకర్ అలీలను శనివారం కాలేజీలో ఘనంగా సన్మానించారు. ఈ సంద్భంగా ఇంద్రసేనా రెడ్డి మాట్లాడుతూ.. కళాశాలలోని పేద విద్యార్థులకు సహాయ సహకారాలు అందించేందుకు ఒక కార్యాచరణను రూపొందించి విరాళాలు సేకరిస్తే ఫలితాలుంటాయన్నారు. కాలేజీ భవనం మరమ్మత్తుల కోసం కేంద్ర పురావస్తు శాఖతో మాట్లాడతానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాలభాస్కర్, ఎజాజ్ సుల్తానా, విప్లవ దత్ శుక్లా, పావని పాల్గొన్నారు.



చెరువంతా మురుగే..

రాయదుర్గం: రాయదుర్గంలోని మల్కంచెరువును ఇటీవల రూ.30 కోట్లతో సుందరీకరించారు. వాకింగ్‌ట్రాక్, సైకిల్ ట్రాక్ ఏర్పాటు చేశారు. కానీ చెరువులో మురుగునీరు చేరుతుందని రెండు రోజులుగా చెరువు నుంచి భరించలేని దుర్వాసన వస్తోందని వాకర్స్ తెలిపారు. చెరువులోకి మురుగునీరు రాకుండా ప్రత్యేక పైప్‌లైన్ వేశారు. ఒక వేళ వచ్చినా దాన్ని మూడు దశల్లో శుభ్రంచేసి చెరువులోకి వదిలే ఏర్పాట్లు కూడా చేశారు. అయితే కోట్ల రూపాయలు పెట్టి సుందరీకరించినా ఫలితం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించాలని వాకర్స్ కోరుతున్నారు.

'తీర్మానాలు లేకుండా పనులు చేయలేం'

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో కౌన్సిలర్లు అభివృద్ధి పనులకు తీర్మానాలు చేస్తే తప్ప తాము పనులు చేపట్టలేమని మణికొండ మున్సిపల్ కమిషనర్ కె. ఫల్గుణ్‌కుమార్ స్పష్టం చేశారు.అలకాపూర్ టౌన్‌షిప్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వంశీ ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు, టౌన్‌షిప్‌వాసులు శనివారం కమిషనర్‌ను కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం వారు మాట్లాడుతూ ఐదు నెలలుగా మున్సిపాలిటీలో అభివృద్ధి పనులపై ఎలాంటి తీర్మానాలు జరగలేదని, దాంతో వాటిని చేపట్టే అవకాశం లేకుండా పోయిందని కమిషనర్ చెప్పారన్నారు. నెక్నాంపూర్ చిన్న చెరువు, పెద్ద చెరువుల్లో గుర్రపుడెక్క పెరిగి దోమల సమస్య తీవ్రంగా ఉందని కమిషనర్‌కు వివరించామన్నారు. కొన్ని చోట్ల డ్రైనేజీ అవుట్‌లెట్లను అనుసంధానం చేయకపోవడం, ఖాళీ స్థలాల్లో మురుగు నీరు పారి దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయన్నాయని పరిష్కరించాలని కోరామన్నారు. ఇప్పటికైనా చొరవ తీసుకోవాలని లేకుంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని వారు పేర్కొన్నారు.



మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన అలకాపూర్ వాసులు

మహావీర్ కాలేజీలో వర్క్‌షాపు



వర్క్‌షాపులో పాల్గొన్న విద్యార్థులు

అత్తాపూర్: బండ్లగూడలోని మహావీర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో ' పరిశోధన ద్వారా పరిశ్రమల స్థాపనతో ప్రజలకు సేవలు' అనే అంశంపై శనివారం వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ సంరెడ్డి సురేందర్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రతిభా ద్వారా కొత్త విషయాలను కనుగొని పరిశ్రమల స్థాపన ద్వారా ప్రజలకు టెక్నాలజీ ఫలితాలను అందించాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఉషశ్రీ మాట్లాడుతూ.. విద్యార్థులు కొత్త మోడల్స్‌ను అన్వేషించి సొంతంగా పరిశ్రమల స్థాపన ద్వారా ఇతరులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సూచించారు. ఈ వర్క్‌షాపును ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ద్వారా డాక్టర్ వి.వి.ప్రతిభా భారతి, ప్రొఫెసర్ డాక్టర్ నాయర్ శ్రీజా, మృదల సహకారంతో విజయవంతమైందన్నారు. సామాజిక బాధ్యతగా కళాశాల సిబ్బంది స్లోకా స్కూల్‌కు చెందిన 8, 9, 10వ తరగతి విద్యార్థులకు ల్యాబ్ నైపుణ్యం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల జాయింట్ సెక్రటరీ సంరెడ్డి ధనుంజయ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



స్లోకా స్కూల్‌కు చెందిన విద్యార్థులు

వ్యక్తి అదృశ్యం

అత్తాపూర్: ఇంటి నుంచి బయటికి వెళ్లిన ఓ వ్యక్తి కనిపించకుండా పోయిన ఘటన శనివారం అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం.. అత్తాపూర్ వీకర్ సెక్షన్ కాలనీ ప్రాంతానికి చెందిన బాబురావు మూడో కుమారుడు శీను (27) ఈ నెల 2న సాయంత్రం 4 గంటలకు పని ఉందని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. దీంతో శీను సోదరుడు అనిల్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్ల పోలీసులు తెలిపారు.



శీను (ఫైల్)

'మణికొండ' మలుపులు

- మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసానికి పెరుగుతున్న మద్దతు
- ఇప్పటికే సంతకాల పరిశీలన పూర్తి



మణికొండ మున్సిపల్ కార్యాలయం

మణికొండ: మణికొండ మున్సిపల్ చైర్మన్ కస్తూరి నరేందర్ ముదిరాజ్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానం అనూహ్య మలుపులు తిరుగుతున్నది. ఇప్పటికే కలెక్టర్‌కు అందించిన లేఖపై 10 మంది కౌన్సిలర్ల సంతకాలు చేయగా, 20వ వార్డు కౌన్సిలర్ కె.లక్ష్మీనాగేశ్వర్‌రావు మద్దతు తెలపడంతో వారి బలం 11కు చేరింది. కాంగ్రెస్‌లోని ఏడుగురితో పాటు 14వ వార్డు కౌన్సిలర్ లావణ్యానరేశ్ ఇటీవల బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరింది. దీంతో పాటు ఏడో వార్డు కౌన్సిలర్ బి.పద్మారావు సైతం చైర్మన్‌కు వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మాణంపై సంతకం పెట్టడంతో ప్రతిపక్షాల బలం 12కు చేరింది. అయితే వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి మాత్రం ఇప్పటి వరకు తటస్థంగానే ఉన్నారు. చైర్మన్‌ను దించేందుకు మద్దతు కూడగడితే 13వ ఓటు తాను వేస్తానని వారికి హామీ ఇచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. ఇదిలా ఉంటే కలెక్టర్‌కు ఇచ్చిన తీర్మానం లేఖలోని సంతకాలు సరైనవేనా..? కాదా..? అనే పరిశీలన ఇప్పటికే పూర్తయ్యింది.

ఒక్క ఓటు దూరంలో...

మున్సిపాలిటీలో మొత్తం 20 మంది కౌన్సిలర్లు ఉండగా, అవిశ్వాసం తీర్మానంపై 10 మంది చేసిన సంతకాలు సరిపోయాయి. చైర్మన్‌ను పదవి నుంచి దించాలంటే 13 మంది మద్దతుగా చేతులు లేపాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు వారి బలం 11 మందికి చేరుకోగా, వైస్ చైర్మన్ సైతం వారికే మద్దతు ఇచ్చినా మరో ఓటు అవసరం పడుతుంది. ఆ ఒక్క ఓటు కాంగ్రెస్ శిబిరంలో ఉన్న వారిదే కావడంతో మున్సిపాలిటీలోనూ ఉత్కంఠ నెలకొన్నది. ప్రస్తుత చైర్మన్ వద్ద ఉన్న ఏడుగురిలో ఒకరు విపక్షాలతో కలిస్తే అతని పదవి పోవడం, వారు అతని వైపే ఉంటే అతనికి పదవీగండం తప్పే పరిస్థితి నెలకొంటుంది.

20వ వార్డు కౌన్సిలర్‌కు మద్దతు

ప్రస్తుత చైర్మన్‌ను దించి తిరిగి పదవిని ఎవరికి ఇవ్వాలనే విషయంలోనూ కౌన్సిలర్ల మధ్య స్పష్టత వచ్చినట్టు సమాచారం. 20వ వార్డు స్వతంత్ర కౌన్సిలర్ కమ్మ లక్ష్మీనాగేశ్వర్‌రావును చైర్‌పర్సన్‌గా ఎన్నుకోవాలని నిర్ణయించినట్టు తెలిసింది. ముందుగా బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కె. రామకృష్ణారెడ్డి, ఒకటో వార్డు కౌన్సిలర్ వి.హైమాంజలి అనిల్‌కుమార్‌ను అనుకున్నా.. వారు తప్పుకున్నట్టు కొందరు కౌన్సిలర్లు తెలిపారు. లక్ష్మీనాగేశ్వర్‌రావు చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యాక సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్టు సమాచారం.

ఎంజీఐటీ ప్రొఫెసర్‌కు డాక్టరేట్

మణికొండ: గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాలకు చెందిన సీఎస్ఈ విభాగం ప్రొఫెసర్ శ్యాం సుందర్ పబ్బోజుకు ఉస్మానియా యూనివర్శిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఎఫిషియెంట్ టాస్క్ షెడ్యూలింగ్ ఇన్ క్లౌడ్ కంప్యూటింగ్ ఎన్విరాన్‌మెంట్ యూజింగ్ మెటాహెరిస్టిక్ అల్గోరిథమ్స్ అనే అంశంపై ప్రొఫెసర్ ఆదిలక్ష్మి పర్యవేక్షణలో పరిశోధన చేయడంతో ఆయనకు డాక్టరేట్ లభించింది. దాంతో ఆయనను తోటి అధ్యాపకులతో పాటు ప్రిన్సిపాల్ శనివారం అభినందించారు.

